## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి 9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక సామాన్యుడి నేస్తం



బాలాజీ మిల్క్ ఏజెన్సీ చెర్యాల

మా వద్ద వివాహాది శుభకార్యాలకు పాలు, పెరుగు బకెట్లు, పన్నీర్, ఐస్ క్రీం మొ.నవి ఆర్డర్ పై సప్లై చేయబడును.

NSR పాలు, పాల పదార్థాలు

CONT: 9666464085



ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 84 శనివారం జూలై 25 2026, పేజీలు - 4 వెల :2/-


## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

-ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు

-ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం

-డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు

-విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం

-ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు

హిందుస్థాన్ మీడియా

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం,




ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసు కుంటారు. ఆ తర్వాత విలీనానికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై తుది విధివిధానాలను ఖరారు చేస్తారు. డిసెంబరు 9న విలీనంపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.

## కేటీఆర్ ను సీఎంగా చూడటమే తన లక్ష్యమని వెల్లడి

-పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

-మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారంటూ జోరుగా ప్రచారం

-ఆ ప్రచారంలో నిజం లేదన్న మల్లారెడ్డి

హిందుస్థాన్ మీడియా



రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులు గా తన పార్టీ మార్పు పై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేటీఆర్ 125 ఏళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన లక్ష్యమని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## జనావాసాల మధ్యే ఇందిరమ్మ ఇండ్లు..

## నిరుపయోగ ప్రభుత్వ భూముల గుర్తింపునకు సీఎం ఆదేశం

హిందుస్థాన్ మీడియా

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాలకు సమీపంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిరుపయోగ భూములను గుర్తించి, వాటిని గృహ నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన నిరుపయోగ స్థలాలను వినియోగించి, ఆయా శాఖలకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో భూములు కేటాయించాలని సీఎం ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరు పయోగంగా మారే ప్రమాదం ఉందని సీఎం పేర్కొన్నారు. అందువల్ల పని ప్రాంతాలకు దగ్గరగా, ప్రజలు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. క్యూర్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ఫ్లాట్‌ను 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో



నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు కాగా, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. భూమి వ్యయాన్ని ప్రభుత్వం పూర్తిగా భరిస్తుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా,అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఈ ఇళ్లను నిర్మించ నున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు యాజమాన్యాలూ బాధ్యత వహించాలి: సీఎం రేవంత్ రెడ్డి

హిందుస్థాన్ మీడియా

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాంపస్‌లలో డ్రగ్స్‌కు సంబంధించిన ఏ ఘటన జరిగినా యాజమాన్యాలు కూడా బాధ్యత వహించేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధానికి సంబంధించి నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై అధ్యయనం చేయాలని సీఎం పేర్కొన్నారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీల సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. విద్యాసంస్థల క్యాంపస్‌లలోనే కాకుండా, క్యాంపస్ బయట జరిగే డ్రగ్స్ కార్యకలాపాలను కూడా గుర్తించి సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు విద్యాసంస్థల ప్రాంగణాల్లో టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూ ఆర్ కోడ్



ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.డ్రగ్స్ కార్యకలాపాలను గుర్తించడం, వినియోగదారులను వ్యసనం నుంచి బయటపడేలా చేయడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం అనే మూడు దశల్లో సమర్థవంతంగా పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. తొలిసారి పట్టుబడిన వారిని డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి కౌన్సిలింగ్ అందించాలని, పదేపదే నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు విధించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఈగల్ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు వెన్నెముక: సీఎం చంద్రబాబు

హిందుస్థాన్ మీడియా

పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామ న్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐటీడీఏలో ప్రాధాన్యం




ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి పదవికి రవ్‌నీత్ సింగ్ రాజీనామా

హిందుస్థాన్ మీడియా

పంజాబ్ బీజేపీ నాయకుడు రవ్‌నీత్ సింగ్ బిట్టూ కేంద్ర రైల్వే, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. రవ్‌నీత్ సింగ్ రాజీనామాను తక్షణమే అమల్లోకి




వచ్చేలా ఆమోదించారు. 2024 నుంచి రవ్‌నీత్ కేంద్ర మంత్రిమండలిలో కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది (2027) పంజాబ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడానికే ఆయన తన కేంద్ర మంత్రి పదవిని వీడినట్లు సమాచారం. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేయబోతున్నట్లు తెలుస్తోంది. రాజీనామా చేయడానికి ఒక రోజు ముందు (గురువారం), ఆయన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఓ లేఖ రాశారు. పంజాబ్ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలకమైన రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆ లేఖలో కోరారు. పంజాబ్ ఆర్థిక వృద్ధికి, కనెక్టివిటీకి ఈ రైల్వే ప్రాజెక్టులు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

# బెజ్జంకిలో విద్యాసంస్థల బంద్

-ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండించిన ఏఐఎస్ఎఫ్



హిందుస్థాన్ మీడియా, బెజ్జంకి:

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బెజ్జంకి మండల కేంద్రంలోని విద్యాసంస్థలను శుక్రవారం బంద్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల శాంతియుత నిరసనపై లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మిడి సాయి, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు రాకేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఏఐఎస్ఎఫ్--ఏఐవైఎఫ్ నాయకులు బాబు, కొడముంజ శంకర్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

-నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా చేర్యాలలో తరగతుల బహిష్కరణ..



హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు గౌడ్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తరగతులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అందే అశోక్, ఆకుల రాజు గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు, నిరుద్యోగులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాహుల్ గాంధీతో పాటు నిరసనల్లో పాల్గొన్న విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సూర సంపత్, బోయిని మల్లేశం, పోట్లపల్లి ప్రశాంత్, గడ్డం ప్రవీణ్, పోరండ్ల చందుతో పాటు కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయి తేజ్ జన్మదినం సందర్భంగా ఆసుపత్రి వద్ద అల్పాహార పంపిణీ

-సేవా కార్యక్రమం నిర్వహించిన జనగామ అమ్మ ఫౌండేషన్



హిందుస్థాన్ మీడియా, జనగామ:

సిద్ధిరాల సాయి తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన తల్లిదండ్రులు సిద్ధిరాల వెంకట్, రేణుక జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు అల్పాహారం పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్ మాట్లాడుతూ సాయి తేజ్‌కు ఫౌండేషన్ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవే లక్ష్యంగా అమ్మ ఫౌండేషన్ పనిచేస్తోందని, దేశంలో ఆకలి బాధలను నిర్మూలించాలనే సంకల్పంతో ప్రతి ఒక్క యువకుడు, యువతి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు పండుగ నరేష్, సిద్ధిరాల చందు, పిట్టల కృష్ణ, ఉల్లెంగుల మణి తదితరులు పాల్గొన్నారు.

# వాణినికేతన్ హై స్కూల్‌లో ఘనంగా “మెహందీ ఫెస్ట్--2026”

-భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విద్యార్థుల్లో అవగాహన





హిందుస్థాన్ మీడియా, ఇల్లంతకుంట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్ ఆవరణలో శు క్రవారం లి”మెహందీ ఫెస్ట్--2026”లిను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో “చేతులకు గోరింటాకు.. మనసుకు సంతోషం” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై వివిధ రకాల గోరింటాకు డిజైన్లను రూపొందించి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించేలా కళకళలాడింది. పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వాన్ని పెంపొం దించేందుకు పాఠశాలలో తరచూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయినీలు సుమంగళి, శోభ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, షమీమా, రేణుక, జలజ, శాంత, పద్మ, సునీత, స్వాతి, ఉష, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, తిరుపతితో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

-ఆకునూరులో రైతులకు అవగాహన సదస్సు



హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎల్‌నినో ప్రభావం, పంటల సంరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మండల వ్యవసాయ అధికారి ఎండి. అఫ్రోజ్, ఎంపీడీవో అనభేరి ప్రణయ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల కారణంగా ఎల్‌నినో ప్రభావం పంటలపై పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా విత్తనాలు వేయాలని, నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించాలని, తెగుళ్లు, పురుగుల నివారణకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ కరీమోద్దీన్, ఉప సర్పంచ్ కడారి పల్లవి--భాస్కర్, ఏఈఓ పూజ, వార్డు సభ్యులు అందె లక్ష్మీ, సూర అనిత, జూపల్లి కార్తిక్ రెడ్డి, తాటికొండ శేఖర్, భూమని భాస్కర్, ఘనపురం బాలనర్సమ్మ--అంజయ్య, మంతపురి భాగ్య, స్వర్గం రాజేష్, గ్రామ రైతులు, వ్యవసాయ, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మర్మాములలో ఎల్‌నినోపై అవగాహన గ్రామసభ

-వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి: సర్పంచ్ సత్యనారాయణ గౌడ్



హిందుస్థాన్ మీడియా, మద్దూరు:

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్య నారాయణ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం ఎల్‌నినో ప్రభావంపై అవగాహన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. నీటి సంరక్షణతో పాటు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు. అలాగే గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామ సభలకు హాజరై తమ సూచనలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏపీఓ మంజుల, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ, ఐసీడీఎస్ సూపర్వైజర్, కార్యదర్శి అశోక్, గ్రామ పాలకవర్గ సభ్యులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్





-మంత్రి రాజీనామా చేయాలి: డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు శంకర్

హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట జిల్లా:

నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పంతం శ్రీనివాస్తో కలిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామునిపట్ల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలతో పాటు పలు విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్, ప్రజాసంఘాల నాయకులు రిత్తిక్, రక్షిత్, మధు, శశికుమార్, లక్ష్మణ్, అరవింద్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

-ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం’ డిమాండ్

-డిఐఈఓ కు వినతి



హిందుస్థాన్ మీడియా,

నల్గొండ జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు (అఫిలియేషన్), అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం’ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఇంటర్మీడియట్ విద్య అధికారి దసురు నాయక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కట్టెల శివకుమార్ మాట్లాడుతూ... నల్గొండ జిల్లాలో కొన్ని యాజమాన్యాలు ఒక్క కాలేజీకి మాత్రమే పర్మిషన్ తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా 3 నుండి 4 భవనాలలో బ్రాంచీలు నడుపుతున్నారని ఆరోపించారు. కనీస మౌలిక వసతులు, ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత) లేని భవనాల్లో కాలేజీలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా డుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిజినెస్

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత విలీనానికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై తుది విధివిధానాలను ఖరారు చేస్తారు. డిసెంబరు 9న విలీనంపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.

## ఎయిర్‌లైన్స్ వ్యాపారంలో అదానీ, జీఎంఆర్‌కు ఎంట్రీ!





**న్యూఢిల్లీ:** అదానీ, జీఎంఆర్ వంటి విమానాశ్రయాల నిర్వాహణ సంస్థలను కూడా ఎయిర్‌లైన్స్ వ్యాపారంలోకి అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన విధానాలను సడలించే దిశగా పౌర విమానయాన శాఖ ఇప్పటికే అంతర్గత చర్చలను ప్రారంభించినట్లు తెలిసింది. అయితే, ఈ విధానపరమైన మార్పునకు కేంద్ర న్యాయ శాఖతో పాటు ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ కమిటీ కూడా ఆమోదం తెలపాల్సి ఉంటుంది. నిబంధనల మార్పు ద్వారా దేశీయ విమానయాన సేవల విభాగంలో 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ఇండిగో, ఎయిరిండియాల ఆధిపత్యానికి అడ్డుకట్ట పడనుంది. అలాగే, కొత్త ఎయిర్‌లైన్స్ ప్రవేశంతో మార్కెట్లో పోటీ పెరుగుతుందని కేంద్రం భావిస్తోందని ఈ విషయంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం విమానాశ్రయాల నిర్వహణ సంస్థలు ఏదేని ఎయిర్‌లైన్స్‌లో 10 శాతానికి మించి వాటా కలిగి ఉండటానికి అనుమతి లేదు. ఈ పరిమితిని ఎత్తివేస్తే, విమానాశ్రయ నిర్వహణ సంస్థలు కూడా ఎయిర్‌లైన్స్‌లో యాజమాన్య వాటా కలిగి ఉండటంతో పాటు వాటిని నిర్వహించేందుకు వీలు కలగనుంది. ప్రస్తుతం అదానీ గ్రూప్ ముంబైలో రెండు ఎయిర్‌పోర్ట్‌లతో పాటు మరో 6 విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. దేశీయంగా జీఎంఆర్ గ్రూప్ చేతిలో హైదరాబాద్, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్ట్‌లున్నాయి. భోగాపురం విమానాశ్రయం వచ్చే నెలలో ప్రారంభం కానుంది. అదానీ ఆసక్తి: ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే కొత్త ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించేందుకు భారత కుబేరుడు గౌతమ్ అదానీ ఆసక్తిగా ఉన్నట్లు రాయిటర్స్ తాజా కథనం వెల్లడించింది. అయితే, అంతగా లాభాలు పంచే వ్యాపారం కాకపోవడంతో పాటు రిస్క్ ఎక్కువ కావడంతో అన్ని లెక్కలూ సరిచూసుకున్న తర్వాతే అదానీ బరిలోకి దిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అదే గనుక జరిగితే, ఎయిర్‌లైన్స్ మార్కెట్లో ఇండిగో, ఎయిరిండియాకు అదానీ గట్టి పోటీనిచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## ఫ్లిప్‌కార్ట్‌కు భారీ షాక్- ఐఫోన్‌కు బదులు ఆయిల్ పంపినందుకు రూ.1.81 లక్షల జరిమానా

ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు, దాని ప్లాట్‌ఫామ్‌లోని ఓ విక్రేతకు ముంబై వినియోగదారుల ఫోరం గట్టి షాకిచ్చింది. ఖరీదైన యాపిల్ ఐఫోన్ ఆర్డర్ చేసిన వినియోగదారుడికి 'బియర్డ్ గ్రోత్ ఆయిల్' (గడ్డం పెరిగే నూనె) పంపిన కేసులో బాధితుడికి రూ.1.11 లక్షల అసలు మొత్తంతో పాటు రూ.70,000 నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదులను సరైన పరిష్కారం చూపకుండా పదేపదే మూసివేయడం 'అనుచిత వాణిజ్య విధానం' కిందకే వస్తుందని కమిషన్ తన తీర్పులో పేర్కొంది.

**-అసలేం జరిగిందంటే..!**

ముంబైలోని పోవాయ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 2023 ఏప్రిల్ 22న ఫ్లిప్‌కార్ట్ ద్వారా రూ.1,11,793 వెచ్చించి యాపిల్ ఐఫోన్ 14 ప్రో (128 +B)ను నో-కాస్ట్ ఈఎంఐ స్కీమ్‌లో ఆర్డర్ చేశారు. మరుసటి రోజు డెలివరీ అయిన ప్యాకేజీని తెరిచి చూడగా, అందులో స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా బియర్డ్ గ్రోత్ ఆయిల్ బాటిల్, ప్యాకింగ్ సామగ్రి ఉండటంతో ఆయన షాక్ అయ్యారు. వెంటనే ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ సపోర్ట్‌ను సంప్రదించి, అవసరమైన అన్ని ఆధారాలు సమర్పించారు. అయితే, 2023 ఏప్రిల్ నుంచి మే మధ్య పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫ్లిప్‌కార్ట్ నుంచి ఎలాంటి సరైన స్పందన రాలేదు. సమస్యను పరిష్కరించకుండానే, ఆయన ఫిర్యాదును 'పరిష్కరించబడింది' అని పదేపదే మూసివేశారు. దీంతో విసిగిపోయిన బాధితుడు ముంబై సబర్బన్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫోరం, ఫ్లిప్‌కార్ట్, విక్రేత ఇంటర్నేషనల్ వ్యాల్యూ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ తీరును తప్పుబట్టింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ లో వినియోగదారుడు డబ్బు చెల్లించినప్పుడు, ఆర్డర్ చేసిన




వస్తువును సరిగ్గా అందించా ల్సిన బాధ్యత ఈ-కామర్స్ సంస్థపై ఉంటుందని స్పష్టం చేసింది. తప్పు జరిగాక కేవలం అమ్మకానికి మధ్యవర్తిత్వం వహించామని చెప్పి చేతులు దులుపు కోలేదని, ఫిర్యాదును విచారించడంలో, తప్పుగా పంపిన వస్తువును వెనక్కి తీసుకోవడంలో, రీఫండ్ లేదా రీప్లేస్‌మెంట్ ఇవ్వడంలో విఫలమవడం స్పష్ట మైన సేవా లోపమని పేర్కొంది.

# క్రీడలు

## అందుకే ఆర్ఆర్‌తో నా ప్రయాణాన్ని ముగించాను: సంజు శాంసన్

**ఇంటర్నెట్ డెస్క్:** భారత స్టార్ ప్లేయర్ సంజు శాంసన్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఈ విషయంపై సంజు స్పందించాడు. 11 సీజన్ల పాటు రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు..ఆ జట్టును వీడాలనే నిర్ణయం అంత సులభంగా అవ్వలేదని పేర్కొన్నాడు. అయితే కొత్త సవాళ్లను స్వీకరించాలనే ఆలోచనతోనే ఆ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన సంజు.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు .రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం చాలా పెద్ద రిస్క్. ఒకసారి ఫ్రాంచైజీకి మీ నిర్ణయం చెప్పాక వెనక్కి తగ్గే అవకాశం ఉండదు. 2025 సీజన్‌తో ఆర్ఆర్‌తో నా ప్రయాణం ముగించాలనే నిర్ణయానికి వచ్చాను. ఈ విషయంపై నా కుటుంబంతో, ముఖ్యంగా నా భార్యతో మూడు వారాల పాటు చర్చించాను. చివరకు ఇదే సరైన నిర్ణయమని భావించా. నేను ఎప్పుడూ కొత్తగా మొదలుపెట్టడానికి సిద్ధంగానే ఉంటాను. చెపాక్ నెమ్మదైన పిచ్.. నా బ్యాటింగ్‌కు సరిపోదని చాలామంది అన్నారు. ఆ ఆలోచన నా మనసులోకి కూడా వచ్చింది. కానీ 'నీకు ఇప్పుడు 30 ఏళ్లు. కొత్త పరిస్థితులకు తగ్గట్టు నీ ఆటను మార్చుకో' అని నాకు నేనే చెప్పుకున్నాను. అదే ఆత్మవిశ్వాసంతో ఈ సీజన్‌ను ప్రారంభించాను' అని సంజు పేర్కొన్నాడు.




**-వైఫల్యాలే ఎక్కువ..**

'టీ20 క్రికెట్‌లో విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ ఉంటాయి. సీఎస్కేలో తొలి మూడు మ్యాచ్‌ల్లో నేను విఫలమయ్యాను. ప్రపంచకప్ ఫైనల్ ఆడి వచ్చినా ఆ ఫామ్‌ను ఐపీఎల్‌లో కొనసాగించలేకపోయాను. అయినా జట్టు యాజమాన్యం, సహచరుల వైఖరిలో ఒక్క శాతం కూడా మార్పు రాలేదు. అదే నాకు ఎంతో ధైర్యం ఇచ్చింది. ప్రాక్టీస్ సమయంలో మాహీ భయ్యా నా దగ్గరకు వచ్చి 'అన్నీ బాగానే ఉంటాయి. నువ్వు నీలాగే ఆడు' అని చెప్పారు. ఆ చిన్న మాటే నాకు పెద్ద పాఠంగా మారింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీతో మళ్లీ నా జోరు మొదలైంది' అని సంజు తెలిపాడు.

## కామన్వెల్త్ గేమ్స్: సెమీస్‌కు భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్




**ఇంటర్నెట్ డెస్క్:** గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ సత్తా చాటాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సెమీఫైనల్‌లో అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన హీట్స్‌లో శ్రీహరి 25.52 సెకన్లలో రేసును పూర్తి చేసి సంయుక్తంగా 14వ స్థానంలో నిలిచాడు. బెర్ముడాకు చెందిన జాక్ హార్వేతో సమాన సమయాన్ని నమోదు చేసిన నటరాజ్.. టాప్-16లో చోటు దక్కించుకుని సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఈ హీట్‌లో శ్రీహరి ఐదో స్థానంలో నిలిచాడు. రెండు ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఈ భారత స్విమ్మర్.. ఇప్పటికే పలు జాతీయ రికార్డులు తన పేరిట నమోదు చేసుకున్న సంగతి తెలిసిందే.పారా స్విమ్మింగ్‌లో ఫైనల్‌కు. పారా స్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 విభాగంలో భారత క్రీడాకారులు ఆర్‌వీవీబీకే బుడిగినా, ఇమామ్ అలీ ఫైనల్‌కు అర్హత సాధించారు. ఈ విభాగంలో హీట్స్‌లో పాల్గొన్న ఎనిమిది మంది ఆటగాళ్లూ ఫైనల్‌కు చేరడం విశేషం. బుడిగినా 57.10 సెకన్ల టైమింగ్‌తో హీట్స్‌లో మూడో స్థానంలో నిలవగా.. ఇమామ్ అలీ 1:05.32 సెకన్లతో చివరి స్థానంలో ఉన్నాడు. కాగా, ఎస్13 విభాగం దృష్టి లోపం ఉన్న అథ్లెట్ల కోసం నిర్వహించే పారా స్విమ్మింగ్ కేటగిరీ.

## ఆసియా క్రీడలు: క్రికెట్ షెడ్యూల్ విడుదల నేరుగా క్వార్టర్ ఫైనల్‌లోకి టీమిండియా




**ఇంటర్నెట్ డెస్క్:** జపాన్ వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో క్రికెట్ నాలుగోసారి చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మహిళల టీ20 మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న ప్రారంభం కానుండగా.. పురుషుల టోర్నీ సెప్టెంబర్ 24 నుంచి మొదలు కానుంది. అన్ని మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్‌లో జరగడంతో పాటు పూర్తి అంతర్జాతీయ హోదా కలిగి ఉండనున్నాయి. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగనున్నాయి.పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇక గ్రూప్-ఎలో అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బిలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ జట్లు మిగిలిన నాలుగు క్వార్టర్ ఫైనల్ స్థానాల కోసం పోటీపడనున్నాయి. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు జట్లు సూపర్ 8 దశకు చేరుకుంటాయి. కాగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఈ టోర్నీలో లీగ్ లేదా క్వార్టర్ ఫైనల్‌లో జరిగే అవకాశం లేదు. ఇరు జట్లు సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో తలపడే అవకాశం ఉంటుంది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్-పాక్ పోరు జరగాలంటే రెండు జట్లు చివరి దశ వరకు చేరాల్సిందే.

# గోవిందా, కరిష్మా.. తెర వెనుక ఆసక్తికర బంధం ఇదే!



బాలీవుడ్ తెరపై 90వ దశకంలో అత్యంత విజయవంతమైన జంటల్లో గోవిందా, కరిష్మా కపూర్ జోడీ ఒకటి. వీరిద్దరూ కలిసి అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అయితే, తెర వెనుక వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి, షూటింగ్ నాటి జ్ఞాపకాల గురించి గోవిందా తాజాగా కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పని కంటే ఎక్కువగా కరిష్మాకు రక్షణగా ఉండటానికే తాను ప్రాధాన్యత ఇచ్చేవాడినని ఆయన వెల్లడించారు. ఓ ప్రముఖ టాక్ షోలో పాల్గొన్న గోవిందా, కరిష్మాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆమె క్రమశిక్షణ, అంకితభావాన్ని ఆయన ప్రశంసిం చారు. "లోలో (కరిష్మా ముద్దు పేరు) చాలా సింపుల్, అమాయకురాలు. 1940ల నాటి హీరోయిన్ల లాగా నేరుగా షూటింగ్‌కు వచ్చేది. షూటింగ్ సమయంలో పని చేయడం కంటే ఎక్కువగా, నేను లోలోను కాపాడుతూనే ఉన్నాను. ఎప్పుడూ ఆమెకు రక్షణగా నిలిచాను" అని గోవిందా అన్నారు. తాను కలిసి పనిచేసిన నటీమణులలో కరిష్మా అత్యంత నిజాయతీపరురాలని ఆయన కొనియాడారు. గోవిందా మాటలను కరిష్మా కూడా ధ్రువీకరించారు. "ఆయన ఎప్పుడూ నన్ను చాలా జాగ్రత్తగా చూసుకునేవారు" అని ఆమె తెలిపారు. అంతేకాదు తాను స్కూల్‌లో ఉన్నప్పటి నుంచే గోవిందాకు వీరాభిమానినని ఆమె గుర్తుచేసు కున్నారు. ఒక పాత సంఘటనను గుర్తుచేస్తూ.. "నాకు 12-13 ఏళ్లు ఉన్నప్పుడు 'గోవిందా నైట్' అనే షో గురించి పేపర్‌లో చదివాను. ఆ షోకి ఎలాగైనా వెళ్లాలని, టికెట్లు తీసుకురావాలని మా అమ్మానాన్నలతో గొడవపడ్డాను. ఆ షోకి వెళ్లడం నా జీవితంలో గొప్ప క్షణం. షో తర్వాత బ్యాక్‌స్టేజ్‌కి వెళ్లి ఆయన్ను కలిసి ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాను" అని కరిష్మా ఆనందంగా చెప్పారు. ఇదే సమయంలో 'రాజా బాబు' సినిమా షూటింగ్ నాటి ఓ సంఘటనను గోవిందా గుర్తుచేసుకున్నారు. ఒక సన్నివేశంలో భాగంగా కరిష్మా వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాల్సి వచ్చిందని, ఎత్తు చూసి ఆమె చాలా భయపడిపోయిందని తెలిపారు. ఆ భయంతో ఆమె డైలాగులను కూడా వేర్వేరు స్వరాల్లో చెప్పిందని ఆయన నవ్వుతూ చెప్పారు. కాగా, వీరిద్దరూ కలిసి 'రాజా బాబు', 'కూలీ నెం. 1', 'హీరో నెం. 1', 'హసీనా మాన్ జాయేగీ', 'సాజన్ చలే ససురాల్' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి ఆ తరం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు.



## రామాయణంలో సీతగా సాయి పల్లవి బుల్లితెర సీత దీపిక చిఖాలియా స్పందన



నితేశ్ తివారీ రామాయణం చిత్రంలో టాలీవుడ్ నటి సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామానంద్ సాగర్ బుల్లితెర రామాయణంలో సీత పాత్రలో అమరిన దీపిక చిఖాలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రణబీర్ కపూర్, సాయి పల్లవి ఇద్దరూ చాలా మంచి నటులు. సాయి పల్లవి పని చూశాను. ఆమె అద్భుతమైన నటి. రణబీర్ కూడా అద్భుత నటుడు. ఇద్దరూ తమ పాత్రలను అందంగా చూపిస్తారని నాకు నమ్మకం ఉంది" అని దీపిక చిఖలియా అన్నారు. దీపిక చిఖాలియా 1987లో రామానంద్ సాగర్ టీవీ 'రామాయణం'లో సీత పాత్రలో నటించి భారతీ యుల హృదయాల్లో చెరగ ని స్థానం సంపా దించారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రామా యణం పార్ట్-1 దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రం భారీ బడ్జెట్ ప్రాజెక్టుగా రూపొందు తోంది. దీపిక చిఖలియా వ్యాఖ్యలు సాయి పల్లవి అభిమానుల్లో ఉత్సాహం నింపాయి.

## యూ/ఏ సర్టిఫికెట్‌తో విడుదలకు సిద్ధమైన 'శ్రీనివాస మంగాపురం'

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సోదరుడు రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటించిన 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కథానాయికగా నటిస్తూ తెలుగు చిత్రసీమకు పరిచయమవుతోంది. తిరుపతి నేపథ్యంగా సాగే ఈ ప్రేమకథలో వాసుబాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారిన తర్వాత వారి జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాల చుట్టూ కథ సాగుతుంది. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో గుర్తింపు పొందిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కించడం సినిమాపై అంచనాలను పెంచింది. అలాగే సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు వారసత్వాన్ని కొనసాగిస్తూ జయకృష్ణ ఘట్టమనేని హీరోగా వెండితెరకు పరిచయం కానుండడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌బాబు ప్రతినాయకుడి పాత్రలో నటించారు. అశ్వినీదత్ సమర్పణలో చంద్రమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి. వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

# సోనీ పిక్చర్స్‌తో భారీ డీల్ 'రామాయణ' ట్రైలర్ విడుదల వాయిదా




నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న 'రామాయణం' చిత్రం ట్రైలర్ విడుదల వాయిదా పడింది. అంతర్జాతీయ పంపిణీ హక్కుల నిమిత్తం ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఒప్పందం కుదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా శు క్రవారం వెల్లడించారు. ఈ పరిణామంతో శుక్రవారం ఉదయం విడుదల కావాల్సిన ట్రైలర్ నిలి చిపోయింది. భారతీయ ఇతిహాసం రామాయణా న్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల వద్దకు చేర్చాలన్న తన కల ఈ భాగస్వామ్యంతో సాకార మవుతోందని నమిత్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఇదొక విశేషమైన సందర్భమని, అందుకే ట్రైలర్‌ను త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో విడుదల చేస్తామని ఆయన వివరించారు. అయితే, కొత్త విడుదల తేదీని చిత్ర బృందం ఇంకా ఖరారు చేయలేదు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తుండగా, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుండగా, రెండో భాగం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజా ఒప్పందం ప్రకారం, సోనీ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో పంపిణీ బాధ్యతలు చేపట్టగా, దేశీయ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.







Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455